నుండి తీవ్రంగా ఆలోచించాడు. ఎన్నటికైనా ఎన్ని కష్టాలుసంభవించినా,ఎంతమందిబంధువులు, స్నేహితులు విడనాడినా, కులములోనుంచి వెలివేసినా జిజియానే పెండ్లి చేసికొనుటకు నిశ్చయించాడు. కాని యింకా ఎవ్వరితోనూ చెప్పలేదు. నారాయణరావు యొక్క తెలివితేటలు చూచి, మనోనిశ్చలతను జూచి, హృదయ నైర్మల్యమును గాంచి, ఆత్మశక్తిని పరికించి జిజియా కూడా నారాయణరావునే ఎన్ని అడ్డంకులు వచ్చినా పెండ్లాడుటకు నిశ్చయించుకొన్నది. ఈమె కూడా యింకా ఎవ్వరితోనూ చెప్పలేదు.

## ౧౭

నారాయణరావు యం. యల్ చదువుతూ (apprentice course) కూడా పూర్తిచేసినాడు. జిజియా బి. యే. రాజధానిలో మూడవతరగతిలో ప్యాసయింది. నారాయణరావు యం. యల్. ప్యాసయి హైకోర్టువకీలుగా చేరినాడు. బి.యల్.క్లాసులోనుండగా ఎక్కడినుంచి డబ్బువచ్చేదో ఇప్పుడుకూడా అర్థంకావటంలేదు. హుస్సేనుగారు పంపుచున్నట్లు అనుమానంతోచింది. ధైర్యంచేసికొని హుస్సేనుగారిని అడిగినాడు. ఆయన అప్పుడు"నాయనా, నీయందు ఈశ్వరునికి పూర్ణప్రేమ గలదు. తన్ను నమ్మినవారి కీశ్వరు డెల్లప్పుడు సహాయము చేయుననే యనుకొనుము. ఎవరు పంపిన నేమి నీవు మాత్రం ఈశ్వరునియందు విశ్వాసము వీడక, ఆయన యిచ్చియే నెరవేర్చుచుండుము. నీ కెట్టియిక్కట్లు రాలేవు." అని బదులు చెప్పినారు.

## ౧౮

జిజియాను చూచినప్పుడెల్ల నారాయణరావుకు అదొకవిధమైన వికాసం కలుగుతుంది. అతని హృదయంలోకి అదొకవిధమైన తేజస్సు మెచ్చుకొని వెళ్లుతుంది. వినయవిధేయతలు గొప్పయింటివారి పిల్లలందుండుట అరుదు; కాని ఎక్కడైనా ఉన్నవంటే, జిజియా యందున్నవి. ఆమెమాట్లాడుతూ ఉంటే తేనెలొలుకుతూ ఉండును. ఆమె జ్ఞానం ఎక్కువగుచున్నకొలది వినయం ఎక్కువగుచున్నది; మనస్సు వికాసముచెందినకొలది హృదయమందు ప్రేమ అభివృద్ధి, పవిత్రత గాంచుచున్నది. ఒక విధమైన చిఱునవ్వు- హృదయ పవిత్రతను వెలిపుచ్చు చిఱునవ్వు- చుట్టుప్రక్కల ఉండు వారిలోని దుఃఖాన్ని పటాపంచలుచేసి వెలుగురనే ప్రేమను వెదచల్లే చిఱునవ్వు- ఆమె పెదవులమీద నిత్యం నాట్యంచేస్తూఉంటుంది. ఆమె ఈశ్వరభక్తివిశ్వాసములు అపారములు.

## ౧౯

ఒకనాడు మూడునాలుగు గంటలకు జిజియా తనగదిలో టీ త్రాగుచు ఏదోపుస్తకం చూస్తూ కూర్చుండెను. నారాయణరావు ఆమె గదివద్దకువచ్చితలుపు దగ్గరగావేసి ఉండుటచే మెల్లగా తట్టాడు. 'ఎవరో రావచ్చును' అని మృదుమధుర కంఠస్వరంతో జవాబు




"లోపలికివెళ్లి జిజియాతోపాటు ఫలహారము టీ పుచ్చుకొన్నాడు."

వచ్చింది. లోపలికివెళ్లి జిజియాతోపాటు ఫలహారం టీ పుచ్చుకొన్నాడు. ఏదైన ప్రశాంతస్థలానికి ఒంటరిగ షికారు వెళ్లవలెనని ఉంది. 'నీవుకూడా వచ్చెదవా' అని నారాయణరావును అడిగింది. నారాయణరావు అక్కడికివెళ్లడం ఉద్దేశంకూడా జిజియాతో మాత్రం కలిసి షికారు వెళ్లవలెననియే. అట్లు అడగకయే తన కోరికలన్నిటిని ఈశ్వరుడు తీర్చుచున్నందులకు మన

